సబ్సిడీపై జనుము విత్తనాలు

కడ్తాల్, మే 20 : జనుము విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని ఏవో శ్రీలత తెలిపారు. 60శాతం సబ్సిడీ ఉంటుందని, నాలుగు క్వింటాళ్లు వచ్చాయని తెలిపారు. కడ్తాల ఆగ్రో రైతు సేవాకేంద్రం వద్ద సోమవారం జనుము విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. 40కిలోల బస్తాలు ఉన్నాయని పేర్కొన్నారు. జనుము విత్తనాలు ఎకరానికి 12 నుంచి 15కేజీల వరకు ఒత్తుగా చల్లుకోవాలన్నారు. చల్లిన 45రోజుల్లో పూత దశలో ఉన్నప్పుడు భూమిలో కలియదున్నాలన్నారు. ఇలా చేస్తే 12 టన్నుల పచ్చిరొట్ట ఎరువు లభ్యమవుతుందని తెలిపారు. మండలంలోని రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని శ్రీలత కోరారు.

పాడి రైతుల పరేషాన్

- ప్రోత్సాహకాలూ అందడం లేదు
- పశు పోషణ భారంగా మారిందంటున్న రైతులు
- ఇప్పటికైనా బిల్లులు చెల్లించి ఆదుకోవాలని వేడుకోలు

పాడి రైతులు తమకు రావాల్సిన బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారా అని వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. వేల రూపాయలు పెట్టి పశుగ్రాసం కొని పాల ఉత్పత్తిని పెంచి వాటిని అమ్మితే విజయ డెయిరీ నిర్వాహకులు సకాలంలో బిల్లులు ఇవ్వకుండా సతాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాడి పశువుల పోషణ తమకు భారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు అడిగినా తమ బిల్లుల గురించి పట్టించుకోవడం లేదని, అదేవిధంగా తమకు ఇస్తామన్న ప్రోత్సాహకం కూడా అందడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా తమకు రావాల్సిన డబ్బులు వెంటనే చెల్లించాలని పాడి రైతులు కోరుతున్నారు.



షాద్‌నగర్ పరిధిలో రూ. మూడు కోట్లు, కడ్తాల పరిధిలో రూ.పది కోట్ల పాల బిల్లులు పెండింగ్

షాద్‌నగర్‌అర్బన్/కడ్తాల, మే 20: ప్రభుత్వరంగ సంస్థ అయిన విజయ డెయిరీ సకాలంలో పాల బిల్లులు ఇవ్వకపోవడంతో రైతులు పరేషాన్ అవుతున్నారు. ప్రతీ 15 రోజులకు ఇవ్వాల్సిన బిల్లులను నెలన్నర అయినా ఇవ్వకపోవడంతో పాడి రైతులతో పాటు పాల సేకరణ ఏజెంట్లు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రైవేట్ కంటే విజయ డెయిరీలో ధర ఎక్కువ ఉండడంతో రైతులు పాలు పోస్తూ బిల్లు కోసం ఎదురుచూస్తున్నారు.

సముద్ర మట్టానికి 650 మీటర్ల ఎత్తులో ఉన్న షాద్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని రైతులు భూగర్భజలం పైనే ఆధారపడి వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతున్న చాలామంది రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడి పశువులను పోషిస్తూ జీవనం గడుపుతున్నారు. షాద్‌నగర్ కేంద్రంగా పాలశీతలీకరణ కేంద్రం ఉండడంతో రైతులు ప్రధాన ఆదాయ వనరుగా పాడిని ఎంచుకున్నారు. పిట్టలగూడ, ఎక్లాస్కాన్‌పేట్, కేశంపేట, కొందుర్గు బీఎంసీలతో పాటు షాద్‌నగర్ పాల శీతలీకరణ కేంద్రానికి నిత్యం 18,000 లీటర్ల పాలు వస్తున్నాయి. ప్రైవేట్ డెయిరీలో కిలో ఫ్యాట్ ధర 310 రూపాయలు ఉండగా, విజయ డెయిరీలో కిలో ఫ్యాట్ ధర 350 రూపాయలు ఉంది. ప్రైవేట్ కంటే ధర ఎక్కువ ఉన్న విజయ డెయిరీకే ఎక్కువ మంది రైతులు పాలు పోస్తున్నారు. గత అక్టోబర్‌లో ఆరువేల లీటర్లు మాత్రమే వచ్చే విజయ డెయిరీకి ఇప్పుడు 18,000 లీటర్ల పాలు వస్తున్నాయి. విజయ డెయిరీకి పాలు పెరగడంతో బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ప్రతి 15 రోజులకు విజయ డెయిరీ రైతులకు కోటి రూపాయల వరకు బిల్లు చెల్లించాల్సి ఉంది. గత డిసెంబర్ నుంచి బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతూ వస్తున్నది.
ప్రస్తుతం ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి మూడు బిల్లులు రావాల్సి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇస్తామన్న లీటరుకు నాలుగు రూపాయల ప్రోత్సాహం కూడా ఇవ్వడం లేదు. ధర మేరకు పాల బిల్లు కూడా ఇవ్వకపోవడంతో పాడి పశువుల పోషణ ఇబ్బందిగా మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులతో మాకేంటి సంబంధం ప్రతి 15 రోజులకు డబ్బులు ఇవ్వాలని రైతులు ఇబ్బంది పెడుతున్నారని పాలసేకరణ కేంద్రాల నిర్వాహకులు ఆవేదన చెందుతున్నారు.



కడ్తాల విజయ డెయిరీలో పాలు పోస్తున్న రైతులు

పాడి పరిశ్రమే జీవనాధారం....

రాష్ట్ర రాజధానికి చేరువలో ఉన్న కడ్తాల ప్రాంతం పాల ఉత్పత్తికి ప్రసిద్ధి. వేల మంది రైతులు పాడి ఆవులు, గేదెల ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయానికి అనుబంధంగా ప్రతి రైతు ఒకటి రెండు పాడి పశువులను పోషిస్తున్నారు. కడ్తాల ప్రాంతంలో ఐదు దశాబ్దాల క్రితమే పెద్ద ఎత్తున పాల దిగుబడి ఉండడంతో ఆనాటి రోజుల్లోనే పాలశీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వాల ప్రోత్సాహం ద్వారా కాలక్రమేణ రైతులు కూడా పాడి పరిశ్రమపై మక్కువ చూపారు. మేలురకం సంకర జాతి పాడి పశువులను పోషిస్తూ క్రమంగా పాల దిగుబడిని పెంచుకున్నారు. విక్రయానికి అనువుగా ఉండడం, పాలకు మార్కెట్‌లో మంచి ధర లభిస్తుండడంతో క్రమంగా రైతులు పాడిశ్రమను అభివృద్ధి చేసుకున్నారు. తద్వారా పాల దిగబడిలో ఈ ప్రాంతం రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచింది.

పశుపోషణ భారమవుతున్నది



విజయ డెయిరీ నుంచి సకాలంలో పాల బిల్లులు రాకపోవడంతో పశుపోషణ భారమవుతున్నది. పాడి పశువులకు ప్రతి నిత్యం పచ్చి మేత, ఎండు మేత, కుట్టితో పాటు దాణ పెట్టాలి. పనిచేసే వారికి నెలనెలా జీతాలు ఇవ్వాలి. పశుగ్రాసం కోసం వినియోగించే ట్రాక్టర్ నిర్వహణ ఖర్చులు భరించాలి. బ్యాంకు రుణాల వాయిదాలు చెల్లించాలి. బిల్లులు సకాలంలో ఇవ్వక పోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

జి. శ్యాంసుందర్, పాడి రైతు,మొగిలిగిద్ద

పాలు పెరగడంతోనే బిల్లుల జాప్యం



ప్రైవేట్ డెయిరీలో పాల ధరను తగ్గించడంతో విజయ డెయిరీకి అనూహ్యంగా పాలు పెరిగాయి. గత అక్టోబర్‌లో ఆరువేల లీటర్ల పాల నుంచి 18వేల లీటర్లకు పెరిగాయి. విజయ డెయిరీకి పాలు పెరిగి, వినియోగం తగ్గడంతో బిల్లుల చెల్లింపులో కాస్త జాప్యం జరుగుతున్నది. ఏప్రిల్ ఒకటి నుంచి మూడు బిల్లులు ఇవ్వాల్సి ఉంది. ఏప్రిల్ 15 వరకు ఉన్న బిల్లు చెల్లింపు ప్రారంభమైంది. ఒకటి రెండు రోజుల్లో ఒక బిల్లు చెల్లింపు పూర్తవుతుంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మిగిలిన రెండు బిల్లులు కూడా వస్తాయి.

కె. సురేష్, మేనేజర్, ఎంసీసీ,షాద్‌నగర్

అధికారులకు నివేదించాం



కడ్తాల పాలశీతలీకరణ కేంద్రం పరిధిలో పాల బకాయి బిల్లుల చెల్లింపు గురించి పాడి పరిశ్రమ సహకార సమాఖ్య ఉన్నతాధికారులకు నివేదించాం. మన్నెగూడ, జైతారం, చంద్రధన బీఎంసీ పరిధిలోని పాడి రైతులకు ఏప్రిల్ 1 నుంచి 15 తేదీ వరకు సంబంధించిన మొదటి పక్షం బిల్లులు ఇటీవలే చెల్లించడం జరిగింది. మిగతా బీఎంసీల పరిధిలోని రైతులకు మూడు దఫాలుగా అందాల్సిన బకాయి బిల్లులు సాధ్యమైనంత త్వరలో చెల్లిస్తాం. పాల ప్రోత్సహకాలకు సంబంధించిన బకాయిలు ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సి ఉంది.

రాధిక , పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్, కడ్తాల్

బిల్లులు అందక ఇబ్బంది పడుతున్నాం



విజయ డెయిరీకి పాలు పోస్తున్న తాము సకాలంలో బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నాం. కొన్ని నెలలుగా పాల బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతూ వస్తోంది. సమస్యను పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయినా, పలుమార్లు బిల్లుల చెల్లింపులో జాప్యం గురించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా స్పందన లేదు. బిల్లులు అందని కారణంగా పాడి ఆవులకు దాణా కొనుగోలుకు చేస్తున్న అప్పులు పేరుకు పోయాయి. వెంటనే బిల్లులు చెల్లించాలి.

కడారి రామకృష్ణ, పాడి రైతు, కడ్తాల్

మూడు ధఫాలుగా అందని బిల్లులు

విజయ పాడి రైతులకు తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య ద్వారా ప్రతీ 15 రోజులకోసారి బిల్లులు చెల్లిస్తారు. పక్షం అయిపోయిన 5 రోజుల్లో గతంలో బిల్లులు చెల్లించేది. కాగా ఆరు నెలల కాలంగా బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతూ వస్తోంది. రెండు మూడు దఫాలకోసారి రైతులు ఒత్తిడి తెస్తే ఒక్క బిల్లు చెల్లిస్తూ వస్తున్నారు. కడ్తాల పాలశీతలీకరణ కేంద్రం పరిధిలో ఏప్రిల్‌కు సంబంధించి రెండు బిల్లులు, మే మొదటి పక్షం బిల్లు చెల్లించాల్సి ఉంది. 2023 సెప్టెంబర్ నుంచి బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతూ వస్తుందని పాడి రైతులు వాపోతున్నారు. పాల దిగుబడి పెరగడం, పాడి పరిశ్రమ సమాఖ్య నిధులు మెగా డెయిరీకి మళ్లించడం కారణంగా బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతూ వస్తున్నట్లు సమాచారం.

53వేల లీటర్ల పాల సేకరణ

కడ్తాల పాల శీతలీకరణ కేంద్రం పరిధిలోని కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల, ఆమనగల్లు, కందుకూరు మండలాలలోని 117 పాల సేకరణ కేంద్రాల ద్వారా నిత్యం 3వేల మంది రైతుల నుంచి 52,960 లీటర్ల పాల సేకరణ జరుగుతోంది. పాల శీతలీకరణ కేంద్రం పరిధిలోని కడ్తాల, జైతారం, మన్నెగూడ, చల్లంపల్లి, చంద్రధన, మాడ్గుల బీఎంసీల నుంచి పాల శీతలీకరణ కేంద్రానికి పాలు దిగుబడి అవుతున్నాయి. ఈ సీజన్‌లో పాల దిగుబడి గణనీయంగా పెరిగింది. పాల సేకరణ కేంద్రాల ద్వారా ఉదయం, సాయంత్రం రెండుసార్లు పాల సేకరణ చేస్తున్నారు.

రూ.10 కోట్ల బకాయిలు

కడ్తాల పాలశీతలీకరణ కేంద్రం పరిధిలో రూ.10కోట్లు పాడి రైతులకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. వీటిలో కడ్తాల పరిధిలో రూ.1.60 కోట్లు, జైతారం పరిధిలో రూ.14 లక్షలు, మన్నెగూడలో రూ.3 లక్షలు, చంద్రధనలో రూ. 40 లక్షలు, మాడ్గులలో రూ. 48 లక్షలు, చల్లంపల్లిలో రూ. 49 లక్షల చొప్పున బకాయిలు చెల్లించాల్సి ఉంది.

బోనస్‌తో మరింత ‘సాగు’

- ‘సన్నా’లకు ప్రోత్సాహకం
- రూ.500 బోనస్ ఇవ్వాలని సర్కార్ నిర్ణయం
- ఈ సీజన్‌లో పెరగనున్న వరి సాగు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 20: రాష్ట్ర అవసరాలకు సరిపడా సన్న బియ్యాన్ని స్థానిక రైతుల నుంచే సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సన్న రకం వరి సాగు చేసే రైతులకు బస్తాకు రూ. 500 బోనస్‌గా ఇవ్వాలని నిర్ణయించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులతో పాటు హాస్టళ్లకు, మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం ఇవ్వాలని నిర్ణయించింది. అయితే డిమాండ్‌కు తగ్గ సన్నబియ్యం అందుబాటులో లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీన్ని అధిగమించేందుకు స్థానిక రైతులను ప్రోత్సహించి సన్నధాన్యం సాగు పెంచాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా సన్నరకాల వరిని సాగు చేసే రైతులకు బోనస్ ఇస్తున్నట్లు ప్రకటించింది. సర్కార్ తాజా ప్రకటనతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఈ వానాకాలం వరి సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే బియ్యం ధరలకు రెక్కలు రావడంతో ఉమ్మడి జిల్లాలో గత ఖరీఫ్, రబీ సీజన్‌లలో వరి సాగు గణనీయంగా పెరిగింది. ఇపుడు ప్రభుత్వం సన్నబియ్యం సాగు చేసే రైతులకు అదనంగా మరో రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో ఉమ్మడి జిల్లాలో సన్నరకాల వరి సాగు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. సాధారణంగా ఉమ్మడి జిల్లాలో వానాకాలం సగటు దాదాపు 1.72లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు. అయితే గత ఏడాది రికార్డు స్థాయిలో 2.78లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. అలాగే యాసంగి (రబీ)లో కూడా రికార్డు స్థాయిలో వరి సాగు జరిగింది. రబీలో సాధారణంగా 1.07లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా గడిచిన రబీలో రెట్టింపు స్థాయిలో 2.14లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. యాసంగిలో రంగారెడ్డి జిల్లాలో 74.050 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా అంతకు మించి 188.23శాతం అంటే 1,39,386 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో వరి 52,470 ఎకరాల్లో సాగు చేయాలని నిర్ణయించగా రికార్డుస్థాయిలో రబీలో 1,12,926 ఎకరాల్లో వరి సాగు చేశారు. అలాగే వికారాబాద్‌లో రబీ సీజన్‌లో 87,694 ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా 1,30,514 ఎకరాల్లో పంటలు వేశారు. ఇందులో వరి 87,188 ఎకరాల్లో సాగు చేశారు. అలాగే మేడ్చల్ జిల్లాలో రబీ సీజన్‌లో మొత్తం పంటల సాగు 10,132 ఎకరాల లక్ష్యం కాగా అంతకు మించి 16,333 ఎకరాల్లో పంటలు వేశారు. ఇందులో 13.991 ఎకరాల్లో వరి సాగు చేశారు.



దిగుబడి తగ్గినా రాబడి ఎక్కువే

సాధారణంగా దొడ్డు రకాలతో పోలిస్తే వరి సన్నాలకు దిగుబడులు తక్కువే. దొడ్డు రకాలు సగటు ఎకరానికి 30 నుంచి 35 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. కొన్ని ప్రాంతాల్లో 40 బస్తాలు కూడా రైతులు పండిస్తున్నారు. అదే సన్న రకాలైతే ఎకరానికి సగటున రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి తక్కువగా ఉంటుంది. దొడ్డు రకాలతో పోలిస్తే సాగు సమయంతో పాటు చీడపీడలు బెడద కూడా ఎక్కువే. అయితే ధర విషయానికి వచ్చేసరికి సన్నాలకు విపరీత డిమాండ్ ఉంటుంది. దొడ్డు రకాలతో పోలిస్తే సన్నా రకాలకు క్వింటాల్‌కు రూ. 500 నుంచి 600 అధిక ధర లభిస్తుంది. ఈ రబీలో సన్నాలు సాగు చేసిన రైతులంతా తమ పొలాల వద్దే పంటను అధిక ధరకు అమ్మేశారు. దొడ్డు రకాలు క్వింటాల్‌కు రూ.1,850కు కొనుగోలు చేస్తుండగా సన్నాలు ఇపుడు మార్కెట్‌లో రూ.2,400కు పైగా అమ్ముడవుతున్నాయి. మార్కెట్‌కు తీసుకు వెళ్లకుండానే పొలాల వద్దే ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి అవసరమైన సన్నబియ్యం మార్కెట్‌లో దొరకడం లేదు. ఈ కారణంగా ప్రభుత్వం సన్న రకాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయించింది.

మూడు జిల్లాల్లో గత వానాకాలం వరిసాగు (ఎకరాల్లో)

జిల్లా	సాగు లక్ష్యం	వాస్తవసాగు విస్తీర్ణం
రంగారెడ్డి	79,218	1,30,049
వికారాబాద్	77,554	1,30,835
మేడ్చల్	15,066	17,861
గత యాసంగి వరిసాగు (ఎకరాల్లో)		
రంగారెడ్డి	52,470	1,12,926
వికారాబాద్	45,620	87,188
మేడ్చల్	9,745	13,991

నేటి నుంచి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి కల్యాణోత్సవం

- ముస్తాబైన ఆలయం..

ఏర్పాట్లు పూర్తి

ఇబ్రహీంపట్నం, మే 20: నేటి నుండి మూడు రోజులపాటు జరగనున్న ఇబ్రహీంపట్నం శ్రీ లక్ష్మీనృసింహస్వామి జయంతి, కల్యాణోత్సవానికి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఇందుకుగాను దేవాదాయ శాఖ, భక్తబృందం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇబ్రహీంపట్నం టౌన్‌తో పాటు పరిసర గ్రామాలు, హైదరాబాద్ తదితర ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలింరానున్నందున వసతి, వాహనాల పార్కింగ్‌కు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మంగళవారం స్వామివారి సుప్రభాత సేవ, మంగళశాసనం, విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవచనం, రుత్విక్‌కరణం, మృత్యుంగ్రహణం, అంకురార్పణ, శ్రీసుదర్శన నారసింహ హోమం, ధ్వజారోహణం ఉంటాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి మురళీకృష్ణ తెలిపారు. 22వ తేదీ బుధవారం శ్రీ లక్ష్మీనృసింహ మహాయాగం, మద్యాహ్నిక ఆరాధన, సహస్రనామ పారాయణం, రాత్రి 7.30 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం ఉంటాయని ఆయన చెప్పారు. 23వ తేదీ గురువారం శ్రీ మహాలక్ష్మీయాగం, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, శ్రీ రమాసత్యనారాయణస్వామి వ్రతం, సాయంత్రం 6 గంటలకు రథోత్సవం, ఊరేగింపు, ఆలయ ప్రవేశం, పవళింపు సేవ ఉంటాయని ఆయన తెలిపారు.



ఇబ్రహీంపట్నం సమీపంలో కొండపై ఉన్న ఆలయం

ఆలయ చరిత్ర

ఇబ్రహీంపట్నం పట్టణానికి కిలోమీటర్ దూరంలో ఉత్తర దిశన కృష్ణా పైప్‌లైన్ బైపాస్ రోడ్డులో కొండపై వెలసిన శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయం నిత్య నూతనంగా సంతరించుకుంటుంది. సుమారు 500 ఏళ్ల క్రితం ఈ దేవాలయం నిర్మించారని పెద్దలు చెపుతారు. 30 ఏళ్ల క్రితం వరకు ఈ దేవాలయానికి కనీసం నడవడానికి దారికూడా ఉండేది కాదు. కంపచెట్ల మధ్య జీర్ణావస్థలో ఉన్న ఈ దేవాలయం దాతల సహకారం, భక్తుల రాకతో నేడు దేదీప్యమానంగా వెలుగొందుతోంది. దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న దేవాలయానికి నాలుగెకరాల భూములు కూడా ఉన్నాయి. ప్రశాంతమైన వాతావరణంలో ఈ దేవాలయం ఉన్నందున భక్తులు ఇక్కడ కొంతసేపు స్వామివారి సన్నిధిలో సేద దీరుతున్నారు. ప్రతి శనివారం ఇక్కడ భక్తుల సహకారంతో అన్నదానం చేస్తున్నారు.



ఆలయంలో వెలిసిన శ్రీ లక్ష్మీనర్సింహస్వామి

కోర్కెలు తీరుస్తారని భక్తుల నమ్మకం



ఇక్కడ వెలిసిన లక్ష్మీనృసింహుడు తమ కోర్కెలు తీరుస్తాడనేది భక్తులకు నమ్మకం. ఒకప్పుడు ఆలయానికి వెళ్లాలంటే కనీసం దారి కూడా ఉండేది కాదు. ఇప్పుడు నలువైపుల నుండి చక్కటి దారులున్నాయి. దాతలు ఆలయ అభివృద్ధికోసం ముందుకు వస్తున్నందున అనేక కార్యక్రమాలు తీసుకుంటున్నాం.

- బర్కం లక్ష్మణాచారి, ఆలయ ప్రధానార్చకుడు

ఎంత పెద్ద చేపో!



కేశంపేట మండలం కొత్తపేటలోని బొమ్మసుముద్రం చెరువులో 10కిలోల చేప లభ్యమైంది. గ్రామ మత్స్యకారులు సోమవారం బొమ్మసముద్రం చెరువులో చేపలు పడుతుండగా వలలో 10కిలోల చేప చిక్కింది. ఈ చేప బంగారు తీగ జాతికి చెందిందని మత్స్యకార సంఘం నాయకులు జంగయ్య, గణేష్, సురేష్, సుధాకర్, నరసింహులు తెలిపారు. బొమ్మసముద్రం చెరువులో ఓ చేప 10కిలోల వరకు ఎదగడం ఇదే మొదటిసారని తెలిపారు. నీరు సమృద్ధిగా ఉంటే చేపల ఎదుగుదల బాగుండి, మత్స్యకారులకు లాభం కలుగుతుందని వారన్నారు.

- కేశంపేట, మే 20

కందివనంలో మద్యం విక్రయాలు బంద్

- ఫలించిన యువకుడి నిరసన

షాద్‌నగర్ రూరల్, మే 20: తమ గ్రామంలో బెల్టు షాపుల్లో మద్యం అమ్మకాలను నిలిపేయాలని, మద్యం అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫరూఖ్‌నగర్ మండలం కందివనంలో నవీన్ అనే యువకుడు చిన్నారులతో కలిసి ఆదివారం చేపట్టిన నిరసన దీక్షకు ఫలితం దక్కింది. డిగ్రీ చదువుతున్న యువకుడు, పిల్లలతో కలిసి గ్రామంలో నిరసన చేపట్టాడు. సమాజ హితం కోసం యువకుడు పాటు పడుతున్న తీరుకు స్పందించిన ఎక్సైజ్ సీఐ శేఖర్ తన బృందంతో సోమవారం గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్న ఆరుగురిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. గ్రామంలో మరోసారి మద్యం అమ్మితే రూ.2లక్షల జరిమానా విధిస్తామని సీఐ హెచ్చరించారు. నవీన్ చేపట్టిన నిరసన దీక్ష వద్దకు వెళ్లి అతడితో దీక్ష విరమింపజేశారు.



మద్యం విక్రయదారులను బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు
- ఇంటర్మీడియట్ అధికారి శంకర్ నాయక్

వికారాబాద్, మే 20: ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బం దీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఇంటర్మీడి యట్ అధికారి శంకర్ నాయక్ తెలిపారు. ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సోమవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐవో మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి జూన్ 3 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి సంవ త్సరం పరీక్ష ఉదయం 9. నుండి 12 గంటల వరకు అదేవిధంగా రెండవ సంవత్సరం పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు రెండుదఫాలుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వికారాబాద్‌లో ఆరు పరీక్షా కేంద్రాలు, తాండూరులో నాలుగు, పరిగిలో నాలుగు పరీక్షా కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా నవాబుపేట, పెద్దేముల్, మర్పల్లి, మోమిన్‌పేట, దోమ, కొడంగల్, కుల్కచర్ల మండలాల్లో ఒక్కో పరీక్షా కేంద్రం చొప్పున మొత్తం 20పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం జన రల్, ఒకేషనల్ కలిపి 7831మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవు తున్నారని తెలిపారు. అందులో ఫస్టియర్ విద్యార్థులు 4621మంది, సెకండియర్ విద్యార్థులు 3210మంది ఉన్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్స్, వాచ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించొ ద్దని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ విధించి పోలీసుల



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్ నాయక్

బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. జిరాక్స్ కేంద్రాలను మూసి వేయించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్టీసీ డిపో మేనేజర్ బిక్షు నాయక్, పోస్టల్ అధికారి పద్మారావు, విద్యుత్ శాఖ ఏడీ రామచంద్రయ్య, ఆర్డీవో డీఏవో గోవిందమ్మ, పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్, జూనియర్ లెక్చ రర్ బుచ్చయ్య, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు గడువు పెంపు: డీఐవో

ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్ష ఫీజు గడువు పెంచినట్లు జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి ఎన్.శంకర్ తెలిపారు. పరీక్ష ఫీజును మంగళవారం(నేడు) వరకు రూ.2వేల అపరాద రుసుముతో చెల్లించ వచ్చని తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కళాశాలల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు తెలంగాణ ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసు కుందని తెలిపారు. ఇంతకు ముందు ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థుల యూనిఫాంలు సిద్ధం చేయాలి



మహిళా సంఘాల కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పీడీ శ్రీనివాస్

పూడూరు, మే 20: విద్యార్థుల యూనిఫాంలు సిద్ధం చేయాలని పీడీ శ్రీనివాస్ ఆదేశించారు. మండలంలోని కేరెళ్లి గ్రామంలో విద్యార్థుల యూనిఫాంను కుడుతున్న మహిళా సంఘాల కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల దుస్తులు కుట్టడంపై మహిళా సంఘాలతో సమావేశమై మాట్లాడారు. పాఠశాలలు తెరిచేలోగా విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీచేసే విధంగా కుట్టుపనిని పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం బందయ్య, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

- డీఎల్‌పీవో సంధ్యారాణి



పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సంధ్యారాణి

కులకచర్ల, మే 20: ప్రస్తుత పరిస్థితుల్లో పంచాయతీ కార్యద ర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని డీఎ ల్‌పీవో సంధ్యారాణి తెలిపారు. కులకచర్లలో పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డును సోమ వారం పరిశీలించి ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండ టంతో ఆయా గ్రామాల్లో పంచా యతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి మురుగు కాల్వల శుభ్రం, తాగునీటి సమస్య ఏర్పడకుండా చూడాల న్నారు. వర్షపు నీరు నిల్వ ఉండ కుండా కింది ప్రాంతానికి వెళ్లే విధంగా పంచాయతీ కార్మికులతో తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధిపనులతో పాటు కాల్వల ద్వారా నీరు వెళ్లేవిధంగా శుభ్రం చేయించాలని తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో ప్రజలకు అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కరీం, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సుందరయ్య వర్ధంతి



సుందరయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు

తలకొండపల్లి, మే 20 : ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు పుచ్చల పల్లి సుందరయ్య 39వ వర్ధంతిని వెంకట్రావ్‌పేటలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సీపీఎం జిల్లా నాయకుడు కానుగుల వెంకటయ్య అధ్యక్షతన నిర్వహిం చిన కార్యక్రమానికి ఎంప్లాయిస్ వాయిస్ పత్రిక ఎడిటర్ కె.వెంకటే శ్వర్లు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి అధ్యక్షుడు జగన్ ముఖ్య అతి థులుగా హాజరయ్యారు. సీపీఎం జెండాను ఆవిష్కరించి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. సుందరయ్య ఆశయ సాధనకు అందరూ కృషిచేయాలని వక్తలు పిలుపునిచ్చారు. తన జీవితాంతం పేదల సమస్యల పరిష్కారానికి, స్త్రీ సమానత్వం, సమాజంలో అసమా నతలను రూపుమాపేందుకు, దోపిడీ వ్యవస్థ నిర్మూలనకు సుందరయ్య కృషి చేశారని కొనియాడారు. 17ఏళ్ల పాటు ప్రజాప్రతినిధిగా ప్రజలకు సేవలందించారని పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరే కంగా ఎదురొడ్డిన సాహస వీరుడు సుందరయ్య అని వెంకటేశ్వర్లు, జగన్ అన్నారు. ప్రజానాట్యమండలి కళాకారుల ఆటాపాటలు అలరిం చాయి. కార్యక్రమంలో అంబేడ్కర్-పూలే జాతర కమిటీ రాష్ట్ర కో-ఆర్డినే టర్ సుధాకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి.అంజనేయులు, రఘురా ములు, చెన్నయ్య, కిశోర్, శివశంకర్, అరుణ్‌కుమార్, శ్రీనివాసులు, వెంకటయ్య పాల్గొన్నారు.

ఉపాధి పనులను నాణ్యతగా చేయాలి



ఉపాధి కూలీల మస్టర్లను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం, మే 20 : వర్షం నీరు నేరుగా భూమిలోకి ఇంకేలా సరి హద్దు కందకాలు తవ్వాలని, మొక్కుబడిగా కాకుండా నాణ్యతగా పనులు చేయాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి కూలీలకు సూచించారు. సోమవారం యాచారంలో కూలీలు చేస్తున్న పనులను పరిశీలించారు. మస్టర్‌పై కూలీల సంతకాలున్నాయా లేదా అని చూశారు. మస్టర్లలో కూలీ సంతకాలు లేకుండా పనులు చేయించొద్దని ఫీల్డ్ అసిస్టెంట్ జంగయ్యను ఆదేశించారు. తాగునీటి వసతి ఏర్పాటు చేస్తున్నారా? మెడికల్ కిట్లు ఉంచుతున్నారా? అని కూలీలను అడిగి తెలుసుకు న్నారు. కూలీలకు ఏమైనా ఇబ్బందులుంటే తనకు తెలియజేయాలని ఆయన సూచించారు.

24న పాలిసెట్


జిల్లా సమన్వయ కర్త ఎం.పరమేశ్వర్

వికారాబాద్, మే 20: పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష(పాలిసెట్)ను మే 24న నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జిల్లా సమన్వయకర్త ఎం.పరమేశ్వర్ తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో 2024 సంవత్సరానికి ప్రవేశాలకు మే 24వ తేదీన (శుక్రవారం) పాలిసెట్ పరీక్ష ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాలిసెట్ పరీక్ష వికారాబాద్‌లోని మూడు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షకు జిల్లాకు చెందిన 1321అభ్యర్థులు అందులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కొంపల్లిలో 240మంది, భృంగీ ఇంటర్నేషనల్ స్కూల్, ఎన్నెపల్లిలో 500మంది, శ్రీ అనంత పద్మనాభ డిగ్రీ కళాశాల వికారాబాద్‌లో 481మంది హాజరవుతున్నట్లు తెలిపారు. అభ్యర్థులంతా ఉదయం 10గంటలలోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. 11గంటలు దాటిన తర్వాత ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్ష రాయడానికి అనుమతించబడదన్నారు. అభ్యర్థులంతా హాల్‌టికెట్లు తీసుకుని నిర్ణీత సమయంలో పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

ఇష్టానుసారంగా చెట్ల నరికివేత



వికారాబాద్, మే 20: వికారాబాద్‌లోని ప్రధాన రోడ్ల గుండా, ఆయా కాలనీలోని ప్రధానిదారుల గుండా చెట్లను విద్యుత్ శాఖ అధికారులు ఇష్టానుసారంగా నరికేస్తున్నారు. దానికి వారి కారణాలు వారికి ఉన్నప్పటికీ ముందుగా మొక్కలు నాటే సమయంలో ఏం చేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు ముందస్తు ప్రణాళిక లేకుండా విద్యుత్ తీగల కింద మొక్కలు నాటడంతో అసలు సమస్య తలెత్తింది. ఫలితంగా ప్రజాధనం వృథా అవుతోంది. మొక్కలు నాటడం వాటిని విద్యుత్ శాఖ అధికారులు తొలగించడం తప్ప వాటి వల్ల ప్రయోజనం ఏముందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వికారాబాద్ చుట్టూ ఉన్న ప్రభుత్వ భూముల్లో మొక్కలు నాటితే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు, మునిసిపల్ అధికారుల సమన్వయంతో మొక్కలు నాటితే పెరిగిన చెట్లను నరికే అవకాశం ఉండదని ప్రకృతి ప్రేమికులు అంటున్నారు.

పార్టీ బలోపేతానికి శ్రమించాలి


యువజన కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడికి ఉత్తర్వులను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం, మే 20: మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త శ్రమించాలని, పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు తప్పక ఉంటుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం మండల యువజన కాంగ్రెస్ నూతన కమిటీకి నియామక ఉత్తర్వులు అందజేశారు. నాయకులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను కాంగ్రెస్ అనుకూలురు దక్కించుకునేలా కార్యకర్తలంతా కృషిచేయాలన్నారు. పదవులు ముఖ్యంకాదని, అధిష్ఠించిన పదవితో ప్రజా సేవచేస్తూ తగిన న్యాయం చేయాలన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవుల్లో పార్టీ అభ్యర్థులు గెలిచేలా కార్యకర్తలు కృషిచేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతీ పేద కుటుంబానికి దక్కేలా చూడాలన్నారు. మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, రమేష్, సంయుక్త కార్యదర్శులు నర్సింహ, రాజు, కార్యదర్శి అర్జున్, ప్రధాన కార్యదర్శిగా అజయ్‌లను నియమించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ, మోటె శ్రీశైలం. వి.తిరుమలేష్, మురళి, బాలశివుడు, జగన్‌మోహన్‌రెడ్డి, శేఖర్, సుధాకర్, గాల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


బషీరాబాద్ తహసీల్దార్ ఎదుట ఆందోళనకు దిగిన బాధిత మహిళలు


కోర్టు ఆర్డర్ ఉంటే భూమి రిజిస్ట్రేషన్ ఎలా చేశారు?

- తహసీల్దార్ కార్యాలయంలో బాధితుల ఆందోళన
- వెంట పెట్రోల్ డబ్బా తెచ్చుకుని బెదిరించే యత్నం
- లాక్కొని బయట పడేసిన రెవెన్యూ సిబ్బంది

బషీరాబాద్, మే 20: కోర్టుఆర్డర్ ఉండగా తమ కుటుంబానికి చెందిన భూమిని ఎలా రిజిస్ట్రేషన్ చేశారంటూ బాధిత మహిళ, ఇద్దరు కూతుర్లు బషీరాబాద్ తహసీల్దార్ కార్యాయంలో సోమవారం సాయంత్రం ఆందోళనకు దిగారు. అంతటితో ఆగకుండా వెంట తెచ్చుకున్న పెట్రోల్ డబ్బాను తీసి మాకు న్యాయం జరగకుంటే ఇక్కడే పెట్రోల్ పోసుకుని చస్తామని బెదిరించారు. దీంతో అక్కడే ఉన్న సిబ్బంది పెట్రోల్ డబ్బాను లాక్కొని బయట పడేశారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దామర్‌చెడ్ గ్రామానికి చెందిన ఆశన్‌పల్లి మాణెమ్మకు సుమారు పదెకరాల భూమి ఉంది. ఆమెకు లక్ష్మీ, అమృతమ్మ, శృతి అనే ముగ్గురు కూతుర్లు ఉన్నారు. రెండో కూతురు అమృతమ్మ, భర్త బాల్‌రాజ్ కలిసి 2020లో తన తల్లి మాణెమ్మకు మాయమాటలు చెప్పి 7.20 ఎకరాల వరకు భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు బాధిత మహిళలు ఆరోపించారు. ఈ ఆస్తిలో తమ ముగ్గురు అక్కాచెల్లెళ్లకు సమాన వాటా ఇస్తుందని, అప్పట్లో తమ తల్లి మాణెమ్మతో కలిసి కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఇంటిరియమ్ ఇంజక్షన్ ఆర్డర్ తీసుకువచ్చి కార్యాలయంలో ఇచ్చినట్లు లక్ష్మీ, శృతి తెలిపారు. ఈ భూమిపై ఎలాంటి లావాదేవీలు జరపవద్దని సదరు అడ్వకేట్‌తో కలిసి ఆర్డర్ కాపీని అప్పట్లో ఇక్కడా పనిచేసిన తహసీల్దార్‌కు ఇచ్చినట్లు తెలిపారు. కోర్టు ఆర్డర్ ఉన్నా తమ భూమి సర్వేనంబర్లు బ్లాక్‌లో పెట్టించిన ఈనెల 4వ తేదీన ఆ భూమి రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని తహసీల్దార్ వై.వెంకటేష్‌తో వాగ్వాదానికి దిగారు. తాను ఎన్నికల విధుల్లో ఉన్నానని ఆభూమి హక్కు కలిగిన వ్యక్తులు స్లాట్‌బుక్ చేసుకుంటే రిజిస్ట్రేషన్ చేసి ఉండవచ్చని తహసీల్దార్ బాధిత మహిళలకు వివరించారు. తాము అప్పట్లో కోర్టు ఆర్డర్ కాపీ ఇచ్చి సర్వే నంబర్లు బ్లాక్‌లో పెట్టిస్తే ఎలా ఓపెన్ అయి రిజిస్ట్రేషన్ జరిగిందంటూ వారు తహసీల్దార్‌తో వాదనకు దిగారు. అంతటితో ఆగకుండా బాధిత మహిళ వెంట తెచ్చుకున్న పెట్రోల్ డబ్బా తీసి మాకు న్యాయం జరగకుంటే ఇక్కడే పెట్రోల్ పోసుకుని చస్తామని బెదిరించింది. దీంతో అక్కడున్న సిబ్బంది తీసుకుని బయట పడేశారు. ఈ విషయమై తహసీల్దార్ వై.వెంకటేష్‌ను వివరణ కోరగా కోర్టు ఆర్డర్ ఉన్నట్లు తనకు తెలియదని, కోర్టు ఆర్డర్ కాపీని కార్యాలయంలో ఎప్పుడు ఇచ్చారో కూడా తెలియదని చెప్పారు. రిజిస్ట్రేషన్ అథారిటీ డిప్యూటీ తహసీల్దార్‌కు ఉందని, సదరు యజమాని స్లాట్ బుక్ చేసుకుంటే రిజిస్ట్రేషన్ చేసి ఉండొచ్చని తెలిపారు. బాధిత మహిళలకు తాము ఎం చేయలేమని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పాస్ బుక్కులు జారీ కాకుండా చూస్తానని బాధిత మహిళలకు ఆయన భరోసానిచ్చారు.

విద్యార్థులకు ఉచిత కార్పొరేట్ విద్య

- ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు అవకాశం
- ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ



చేవెళ్ల, మే 20: ప్రభుత్వ పాఠశాలల్లో చదవి పదో తరగతిలో కనీసం 7జీపీఏ సాధించిన విద్యార్థులకు కార్పొరేట్ కాలేజీల్లో ఇంటర్మీడియట్ కోర్సు ఉచితంగా చదివే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. విద్యార్థుల దరఖాస్తులను పరిశీలించి మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం 2024-25లో ఇంటర్మీడియట్‌లో అవకాశం కల్పిస్తారు. కాగా కార్పొరేట్ కాలేజీల్లో చేరే విద్యార్థుల ఫీజును ప్రభుత్వమే కాలేజీల యాజమాన్యాలకు చెల్లిస్తుంది. ఒక్కో విద్యార్థికి ఫీజు కింద ఏటా రూ.35వేల చొప్పున యాజమాన్యాలకు చెల్లించడంతో పాటు విద్యార్థి ఖర్చులకు ఏటా రూ.3వేలు(రెండేళ్లకు రూ.6వేలు) అందజేస్తుంది. మీసేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 30వ తేదీ కల్లా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు సమయంలో ప్రాధాన్యత క్రమంలో మూడు కాలేజీలను విద్యార్థులు ఎంపిక చేసుకోవాలి. జూన్ 3న ఎంపిక జాబితాను ప్రకటిస్తారు. 6 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది.

ఎంపిక విధానం ఇలా..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు ఉచిత కార్పొరేట్ విద్యను అందించేందుకు ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. టెన్త్‌లో సాధించిన జీపీఏను లెక్కలోకి తీసుకుంటూనే రిజర్వేషన్లను అమలు చేస్తారు. ఓపెన్ కేటగిరీలో మాత్రం మెరిట్ చూస్తారు. ఎంపికైన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాల వివరాలతో కూడిన సమాచారం ఇస్తారు. విద్యార్థులు నిర్ణీత గడువులోగా కేటాయించిన కాలేజీలో చేరాల్సి ఉంటుంది.

ఈ పథకానికి అర్హులు ఎవరంటే..

- 2023-24 అకడమిక్ ఇయర్‌లో ప్రభుత్వం పాఠశాలల్లో పదో తరగతి చదవి పరీక్షలో కనీసం 7జీపీఏ, ఆ పైన గ్రేడ్ సాధించాలి.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, మైనార్టీ, ఈబీసీ(ఆర్థికంగా పేదలు) వర్గాలకు చెందిన వారై ఉండాలి.
- జెడ్పీ, ఎయిడెడ్, కేజీబీవీ, నవోదయ, గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు, బెస్ట్ అవైలబుల్ స్కీం కింద చదవిన వారు దరఖాస్తు చేసుకోవాలి.

నియమ నిబంధనలు ఇలా

తల్లిదండ్రుల వార్షికాదాయ పత్రాన్ని దరఖాస్తుతో జతచేయాలి. గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1.5లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షలకు మించి వార్షికాదాయం మించరాదు. రిజర్వేషన్లకు(కుల), స్థానిక ధ్రువపత్రాలు జతచేయాలి. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్‌ను జతచేయాలి. బ్యాంకు పాస్‌బుక్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్‌ఫొటో, ప్రభుత్వ స్కూల్లలో చదివినట్టు కనీసం మూడేళ్ల బోనాఫైడ్‌ను జత చేయాలి.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివి 7 జీపీఏపైగా గ్రేడ్ సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. సీట్లు కేటాయించబడ్డ విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలలో సీట్లతో పాటు అన్ని వసతులకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 30వ తేది లోపు ఆన్‌లైనలో దరఖాస్తు చేసుకోవాలి.

- అక్బర్, ఎంఈవో, చేవెళ్ల

పీర్జాదిగూడ పీఠంపై హై డ్రామా!



- బల నిరూపణకు మేయర్ సిద్ధం
- క్యాంప్ రాజకీయాలు షురూ
- విహారయాత్రకు బీఆర్ఎస్ కార్పొరేటర్లు?
- అప్రమత్తమైన కాంగ్రెస్.. ఔటర్‌పై సినీ ఫక్కీలో చేజింగ్
- పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ/పీర్జాదిగూడ, మే 20(ఆంధ్రజ్యోతి): పీర్జాదిగూడ మేయర్ అవిశ్వాసంపై హైడ్రామా కొనసాగుతోంది. బలనిరూపణకు బీఆర్ఎస్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి తానే అవిశ్వాస ప్రతిపాదన చేశాడు. కలెక్టర్‌కు ఆయన చేసిన విజ్ఞప్తి మేరకు జూన్ 5న అవిశ్వాసం పెట్టాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో క్యాంప్ రాజకీయాలకు తెరలేచింది. అవిశ్వాసం నెగ్గేందుకు బీఆర్ఎస్.. మెజార్టీ కార్పొరేటర్ల మద్దతుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఆదివారం రాత్రి వెంకట్‌రెడ్డి తమ కార్పొరేటర్లను దగ్గరుండి విహారయాత్రకు పంపేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్తున్నాడు. ఔటర్ రింగ్ రోడ్డుపైకి వారంతా కార్లలో వెళ్తుండగా.. గమనించిన కార్పొరేటర్లు వారి వెనకే వెళ్లారు. వెంకట్‌రెడ్డి తీసుకెళ్తున్న కార్పొరేటర్లలో కొందరిని ఒప్పించి తమ వైపునకు తిప్పుకునేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నం చేశారని చెబుతున్నారు. ఈ క్రమంలో ఔటర్‌పై సినీ ఫక్కీలో వాహనాల చేజింగ్ జరిగింది. హయత్‌నగర్ వద్ద ఔటర్ ఎక్కిన ఇరు పార్టీల కార్పొరేటర్ల వాహనాలు.. రింగ్ రోడ్డు మొత్తం తిరిగి ఘట్‌కేసర్ వద్ద ఓఆర్ఆర్ దిగాయి. కొందరు ఇప్పటికే క్యాంప్‌నకు తరలగా.. ఇంకొందరిని ఎవరికి వారు తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

16 నుంచి 8కి బీఆర్ఎస్ బలం

పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో 26డివిజన్లున్నాయి. 2020లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ 16స్థానాల్లో విజయం సాధించగా.. కాంగ్రెస్3, బీజేపీ1, స్వతంత్రులు ఆరుగురు గెల్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ఇక్కడి రాజకీయ పరిణామాలు పూర్తిగా మారాయి. ఎనిమిది మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బీఆర్ఎస్ కార్పొరేటర్ల సంఖ్య ఎనిమిదికి పడిపోయింది. అనూహ్యంగా మేయర్ వెంకట్‌రెడ్డి బలనిరూపణకు సిద్ధమయ్యారు. అప్రమత్తమైన కాంగ్రెస్ క్యాంప్‌నకు వెళ్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లను తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేసినట్టు సమాచారం. తమ కార్పొరేటర్లను భయపెట్టి, ప్రలోభానికి గురిచేసేందుకు గుండాలతో వెంబడించారని వెంకట్‌రెడ్డి ఆరోపించారు.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

ఔటర్‌పై జరిగిన చేజింగ్‌పై బీఆర్ఎస్ పీర్జాదిగూడ ప్రధాన కార్యదర్శి ఎడవల్లి రఘువర్ధన్ సోమవారం ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జక్క వెంకట్‌రెడ్డి, తమ పార్టీ కార్పొరేటర్లపై దాడి, కిడ్నాప్‌నకు యత్నించారని పేర్కొన్నారు. అవిశ్వాసం నెగ్గలేక సుధీర్‌రెడ్డి వెనకుండే ఈ తతంగాన్ని నడిపిస్తున్నాడని ఆరోపించారు. కార్పొరేటర్ అమర్‌సింగ్, ఆయన అనుచరుల ద్వారా సుధీర్‌రెడ్డి ఇదంతా చేయిస్తున్నాడన్నారు. అమర్‌సింగ్‌ను పావుగా వాడుకొని క్యాంపు రాజకీయాలు చేయించిన సుధీర్‌రెడ్డి కోట్ల రూపాయలు ఖర్చు చేయించాడని, ఈ క్రమంలోనే అవిశ్వాసం వీగిపోయేలా వారు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఔటర్‌పై సీసీ ఫుటేజీ పరిశీలిస్తే ఏం జరిగిందో అర్థమవుతుందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పుట్‌పాత్ అక్రమణలపై కదలిక

- పోలీస్, మున్సిపల్ శాఖ సంయుక్తంగా చర్యలు
- నేటి నుంచి గీత దాటొద్దు
- ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు


అక్రమణలను తొలగించాలని సూచిస్తున్న పోలీస్, మున్సిపల్ సిబ్బంది

తాండూరు, మే 20: తాండూరులో ఫుట్ పాతుల అక్రమణలపై అధికార యంత్రాగం కదిలింది. వీధి వ్యాపారులు రోడ్లను అక్రమించుకొని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తమ వ్యాపారాన్ని చేసుకోవాలని వీధి వ్యాపారులకు పోలీస్, మున్సిపల్‌శాఖ వారు సూచించారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఇందిరా చౌక్ నుంచి శాంత్ మహల్ చౌరస్తా, బస్టాండ్ నుంచి శివాజీ చౌక్ వరకు పోలీస్, మున్సిపల్ శాశా సంయుక్తంగా చర్యలకు శ్రీకారం చుట్టింది. తోపుడు బండ్లు, కూరగాయల గంపలు, దుకాణదారులు ముందుగా వేసిన షెడ్లు, ఎక్కడబడితే అక్కడ కూర్చునే కూరగాయ వ్యాపారులు మంగళవారం నుంచి పోలీస్ మున్సిపల్ శాఖ గీసిన గీతకు లోపలే ఉండి వ్యాపారం చేసుకోవాలని సూచించారు. గీత దాటి వ్యాపారం చేసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానా విధిస్తామని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. ఇందిరాచౌక్‌లో అడ్డదిడ్డంగా నిలుపుతున్న తోపుడుబండ్ల వల్ల ట్రాఫిక్ అంతరాయం కలుగుతోందని పలువురు వాపోతున్నారు. మంగళవారం ఉదయం నుంచే రోడ్లను ఆక్రమించకుండా వ్యాపారం చేసుకోవాలని సూచించారు. పాత కూరగాయల మార్కెట్ గాంధీచౌక్ రోడ్డు మార్గంలోనూ ఆక్రమణలను నియంత్రించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తాండూరు అర్బన్ సీఐ సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు, మున్సిపల్ సిబ్బంది చర్యలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.


ఢిల్లీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కాంగ్రెస్ అంటేనే కన్ఫ్యూజన్ పార్టీ

- చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- ఢిల్లీలో ఎన్నికల ప్రచారం

రంగారెడ్డి అర్బన్, మే 20 : కాంగ్రెస్ అంటేనే ఒక కన్ఫ్యూజన్ పార్టీ అని, ఆ పార్టీ నాయకుల్లో ఎప్పుడు ఎవరేం మాట్లాడుతారో, ఎవరిని సమర్థిస్తారో, ఎవరితో పొత్తు పెట్టుకుంటారో తెలియదని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీలో అంతా గందరగోళమే అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఆరో విడతలో ఎన్నికలు జరిగే ఢిల్లీలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో సోమవారం విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల లోక్‌సభ స్థానం ప్రజలు అసెంబ్లీ ఎన్నికలతో సంబంధం లేకుండా, పార్టీలకు అతీతంగా మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ వైపు మొగ్గు చూపారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో డిపాజిట్లు రాని చోట బీజేపీకి భారీ మెజార్టీ రానుందని ధీమా వ్యక్తం చేశారు. రాజ్యాంగం గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. 31శాతం దళితులే ఉన్న రాయ్‌బరేలి నియోజకర్గంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఆ వర్గానికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వలేదన్నారు. ఆ స్థానాన్ని గాంధీ కుటుంబానికి రిజర్వ్ చేసుకున్నారని ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్టు చేయాలని గగ్గోలుపెట్టిన కాంగ్రెస్ పార్టీ అదే లిక్కర్ కేసులో అరెస్టు అయిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మద్దతివ్వడం హాస్యాస్పందం అన్నారు. దేశ రాజధాని ప్రజలంతా బీజేపీకే మరోసారి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



వికారాబాద్, మే 20: బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో చదువుకునేందుకు గిరిజన బాల బాలికలు దరఖాస్తు చేసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. జిల్లా వాస్తవ్యులైన గిరిజన బాల బాలికల నుంచి 2024-25 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ 3, 5, 8వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 64సీట్లు ఖాళీలు ఉండగా 3వ తరగతిలో 32 ఖాళీలకు గానూ లంబాడా బాలురు 18, బాలికలు 11, చెంచులకు మూడు ఖాళీలు(బాలుర 1, బాలికలు 2) ఉన్నట్లు తెలిపారు. 5వ తరగతిలో 16ఖాళీలకు గానూ 10లంబాడా బాలురుకు, నలుగురు బాలికలకు చెంచులకు 2 (బాలుర 1, బాలిక 1) చొప్పున కేటాయించినట్లు తెలిపారు. అదేవిధంగా 8వ తరగతిలో 16ఖాళీల్లో లంబాడా బాలురు 11, బాలికలు 4ఖాళీలుండగా ఒక చెంచు బాలికకు అవకాశం ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన వారు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒక కుటుంబం నుంచి ఒక్కో విద్యార్థికి మాత్రమే బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో అవకాశం ఉంటుందని అన్నారు. తల్లిదండ్రులు వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతం వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంత వారికి రూ.2లక్షల లోపు ఉండాలన్నారు. కుల, ఆదాయ, నివాసం ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల బోనఫైడ్‌తో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. మే 21 నుంచి జూన్ 6వ తేదీ వరకు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తులు పొంది జూన్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కార్యాలయ పరిధిలో తమ దరఖాస్తులను సమర్పించాలన్నారు. జూన్ 12వ తేదీన లాటరీ విధానంలో విద్యార్థుల ఎంపిక ఉంటుందని చెప్పారు. ఎంపికైన విద్యార్థుల జాబితా జూన్ 13న జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో ప్రదర్శించబడుతుందని వివరించారు. పాఠశాలలో ప్రవేశానికి అవకాశం వచ్చిన వారు జూన్ 14న విద్యార్థులు పాఠశాలలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఏదైనా సమాచార నిమిత్తం 9948663053 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.


కడీలను తొలగిస్తున్న గ్రామస్తులు

పాఠశాల స్థల ఆక్రమణను అడ్డుకున్న గ్రామస్తులు

షాద్‌నగర్ రూరల్, మే 20: ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద ఉన్నత పాఠశాల స్థలాన్ని ఆక్రమించుకునేందుకు కొందరు యత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లంపల్లికి చెందిన ఓ వ్యక్తికి సర్వే నంబరు 339లో భూమి ఉంది. అయితే సోమవారం పాఠశాల స్థలం ఉన్న సర్వే నంబరు 287 భూమి రెండు ఎకరాలకు రాతి కడీలు పాతేందుకు పనులు మొదలు పెట్టాడు. ఇది తెలుసుకున్న గ్రామస్తులు స్థలం వద్దకు చేరుకొని పాతిన కడీలను తొలగించేశారు.

'ప్రత్యేక' పట్టింపేది?

- పంచాయతీల పాలనాబాధ్యత ప్రత్యేకాధికారులది
- ప్రజా సమస్యలను పట్టించుకోని అధికారులు
- గ్రామాల్లో పర్యటనలు నిల్!
- ఎక్కడికక్కడ పేరుకుపోతున్న సమస్యలు


మేడిపల్లిలో నిర్వహణ లేని నీటి తొట్టి

యాచారం, మే 20: పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం కొన్ని నెలల కింద ముగియడంతో గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామాలకు మండల/డివిజన్ స్థాయిల అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించింది. ఈ స్పెషల్ ఆఫీసర్లు గ్రామాల్లో అందుబాటులో ఉన్న ఉద్యోగులు, సిబ్బందితో పనులు చేయించాల్సి ఉంది. ప్రతీ వారం గ్రామాన్ని సందర్శించి పర్యవేక్షించాలి. అయితే అధికారులు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు అప్పగించినప్పటి నుంచి ఇప్పటి వరకు తమకు కేటాయించిన గ్రామాలవైపు కన్నెత్తి చూడలేదు. ఇదేమని అడిగితే ఎన్నికల సాకు చూపారు. మొన్నటి వరకు ఎన్నికల పనులున్నా ఇప్పుడైతే ఎలాంటి అదనపు బాధ్యతలు లేవు. ఎన్నికలు ముగిసి ఐదారు రోజులవుతున్నా అధికారులు గ్రామాలపై పట్టించుకోవడం లేదు. యాచారం మండలంలో 24 పంచాయతీలున్నాయి. ప్రత్యేకాధికారులు పంచాయతీ బాధ్యతలను తలకు మించిన భారంగా భావించి పట్టించుకోవడం లేదు. పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించి 4 నెలలవుతున్నా వారు గ్రామ సందర్శనలు చేపట్టడం లేదు. కొందరు మొక్కుబడిగా పంచాయతీలోకి వెళ్లి సందర్శించినట్టు రిజిష్టర్‌లో సంతకం చేసి వెళ్తున్నారు తప్పితే ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను పట్టించుకోవడం లేదు. గ్రామంలో నీటి సమస్య, పారిశుధ్య పనులు, సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ తదితర బాధ్యతలు చూసుకోవాల్సి ఉన్నా వాటిగురించి నిర్లక్ష్యం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులకు పనులు అప్పగించి వెళ్తున్నారు. కాగా పంచాయతీల్లో చేపట్టే పనులకు నిధుల ఖర్చు కోసం పంచాయతీ సెక్రటరీ, ప్రత్యేకాధికారికి జాయింట్ చెక్‌పవర్ ఉంది. అధికారి సంతకం చేస్తేనే పనులకు బిల్లులు డ్రా చేసుకునే వీలుంది. అయితే గ్రామాల్లో అధికారి వారానికోసారైనా అందుబాటులో లేకపోవడంతో చేయాల్సిన పనులు కూడా నిలిచిపోతున్నాయి. కాగా ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో ఉమారాణి రెండురోజులకోసారి గ్రామాలను సందర్శించి సమస్యలు తెలుసుకుంటున్నారు. చౌదర్‌పల్లిలో అంగన్‌వాడీ కేంద్రానికి నీటి వసతి లేక పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఎంపీడీవో వెంటనే నీటి కనెక్షన్ ఇప్పించారు. నర్సరీల సంరక్షణకు కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చారు. వానకాలంలో గ్రామాల్లో అతిసార, డయేరియా వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచిస్తున్నారు.


పూడిక పేరుకున్న మురుగు కాలువ


పంట పొలాల్లో పారబోసిన చెత్త

గ్రామాల సమస్యలు పరిష్కరిస్తున్నాం



నేను, ఎంపీవో ఉమారాణి వారంలో రెండు మూడు రోజులకోమారు గ్రామాల కెలుతున్నాం, జనం ఎదుర్కుంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించగలుగుతున్నాం. గ్రామాలకు వెళ్లని ప్రత్యేకాధికారులను గ్రామాలకు పంపుతా. తాను ఇప్పటికే మండలంలోని ప్రతి గ్రామం సందర్శించాను. తాగు నీటి సమస్య ఏ గ్రామంలో లేదు. మురుగు కాలువలను వారం వారం శుభ్రం చేయిస్తున్నాం.

- నరేందర్‌రెడ్డి, ఎంపీడీవో

ఎరువులు, విత్తనాలు
అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ఆమనగల్లు, మే 20: విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమనగల్లు మండల వ్యవసాయ శాఖ అధికారి అరుణకుమారి అన్నారు. డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడుచుకోవాలని ఆమె సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ రామాంజనేయ, ఆకుతోటపల్లి క్రాస్‌రోడ్డు వద్ద గల రైతు మిత్ర ఆగ్రో ఏజెన్సీలను సోమవారం ఏవో తనిఖీ చేశారు. విత్తన, ఎరువుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. ఎరువుల, విత్తనాల విక్రయానికి సంబంధించి అధీకృత డీలర్లు రైతులకు విధిగా రశీదు ఇవ్వాలని ఆమె సూచించారు. ఈ-పాస్ ద్వారా ఎరువులు విక్రయించి అందుకనుగుణంగా నిల్వలు ఉండేలా చూసుకోవాలన్నారు. రైతులు కూడ కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు రశీదులు తప్పక తీసుకోవాలని తెలిపారు. 2024 వానాకాల పంటల సాగుకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతుందని తెలిపారు. నకిలీ విత్తనాలు ఎవరైనా విక్రయించి రైతులను మోసగిస్తే పీడీ యాక్ట్ కేసులు తప్పవని అరుణకుమారి హెచ్చరించారు. తనిఖీల్లో డీలర్లు, అశోక్, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


ఎరువుల నిల్వను పరిశీలిస్తున్న ఏవో అరుణకుమారి

ఆలయ భూమిలో ఆక్రమణల తొలగింపు


● ప్రహరీని కూల్చేయించిన ఎండోమెంట్ అధికారులు


ఎక్స్‌కవేటర్‌తో ప్రహరీని కూల్చివేయిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

కొందుర్గు, మే, 20 : మండల కేంద్రం శివారు గ్రామమైన లూర్దునగర్‌లో శ్రీలక్ష్మీనర్సింహ స్వామి ఆలయ భూమిలో అక్రమంగా నిర్మాణం చేస్తున్న ప్రహరీని దేవాదాయ శాఖ అధికారులు సోమవారం కూల్చివేయించారు. దేవాదాయ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. లూర్దునగర్‌కు చెందిన జయరెడ్డికి చెందిన పాత ఇల్లు 1,700 గజాల్లో ఉంది. జయరెడ్డి తన ఇంటికి ప్రహరీగోడను నిర్మాణం కోసం పక్కనే ఉన్న ఆలయ భూమి పడమర సర్వే నంబర్ 11, సర్వే నంబర్ 15లో నుంచి సుమారు 40నుంచి 50గజాలు ఆక్రమించుకున్నారని ఎండోమెంట్ ఈవో శ్రీనివాసశర్మ తెలిపారు. ఈ విషయమై తాము గతంలోనే హెచ్చరించామని,పాత ఇంటి స్థలంలోనే ప్రహరీ నిర్మించుకోవాలని సూచించామన్నారు. అయినా వినకుండా ఆలయ భూమిని ఆక్రమించి ప్రహరీని దేవాలయ స్థలంలో నిర్మించారన్నారు. ఉన్నతాధికారులు దగ్గరుండి గోడను కూల్చివేయించినట్లు ఆయన తెలిపారు. ప్రహరీ కూల్చివేత సమయంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్‌బాబు, ఇన్‌స్పెక్టర్ మధుబాబు, ఈవోలు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్‌శర్మ ఉన్నారు. లూర్దునగర్, కొందుర్గు గ్రామాల్లో శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయ భూమికి సంబంధించి 89కేసులు దేవాదాయ శాఖ ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్నాయని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

చెరువులో పూడిక తీయించండి

మండల పరిధిలోని గంగన్నగూడెం దగ్గర శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ భూమిలో ఉన్న తుప్పగూడెం చెరువును ఎండోమెంట్ ఏసీ శేఖర్‌బాబు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చెరువులో పూడిక తీయించే ప్రణాళిక రూపొందిస్తున్నామని, చెరువులో నీరుంటే మాన్యంలోని కౌలు రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇందుకోసం అనుమతులను త్వరలోనే ఇస్తామని తెలిపారు. చెరువు శిఖం భూముల వివరాలను ఈ సందర్భంగా ఆయన సేకరించారు.


తుప్పగూడెం చెరువును పరిశీలిస్తున్న ఎండోమెంట్ ఏసీ శేఖర్‌బాబు

క్రైం కార్నర్

గేట్ దిమ్మె కూలిపడి చిన్నారి దుర్మరణం

షాద్‌నగర్ రూరల్, మే 20 : తోటి పిల్లలతో ఆడుకుంటూ బాలిక గేట్ దిమ్మెను పట్టుకోగా అది కూలిపడి బాలిక మృతిచెందిన విషాదకర ఘటన ఫరూఖ్‌నగర్ మండలం మధురాపూర్‌లో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మల్లేష్-రమాదేవి దంపతుల కూతురు సాక్షి(4) ఆడుకుంటూ ఇంటి ముందు ఉన్న ప్రహరీగోడ గేటు దిమ్మెను పట్టుకుంది. దిమ్మెను బలహీనంగా కట్టడంతో ముట్టుకోగానే బాలిక తలపై పడింది. సాక్షి తలపై పెళ్లలు పడి తల పగిలి అక్కడికక్కడే మృతిచెందింది. కళ్ల ముందే కూతురి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.


మృతిచెందిన చిన్నారి సాక్షి

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు


బికేష్‌సింగ్

కొత్తూర్, మే 20: కొత్తూరులో నివాసం ఉంటున్న బికేష్‌సింగ్(34) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ జి.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఈ నెల 12న బికేష్‌సింగ్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతడి గాలించారు. ఎంతకూ ఆచూకీ దొరక్కపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. బికేష్‌సింగ్ తల్లి ఉర్మిళదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. బికేష్‌సింగ్ ఆచూకీ తెలిసిన వారు 8712568296 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

ఎక్వాయిపల్లిలో గడ్డి వాము దగ్ధం


దగ్ధమైన గడ్డి వాము

కడ్తాల్, మే 20 : మండల పరిధి ఎక్వాయిపల్లిలో సోమవారం రైతు ఈర్లపల్లి లాలయ్య అనే రైతుకు చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఇటీవల వరిచేను కోసి పొలం వద్ద గడ్డివాము పెట్టాడు. ప్రమాదవశాత్తు గడ్డి వాములకు నిప్పంటుకొని పెద్దఎత్తున మంటలు లేచాయి. అప్రమత్తమైన రైతు మంటలార్పే ప్రయత్నం చేయగా అప్పటికే సగానికిపైగా గడ్డి వాము దగ్ధమైంది. దగ్ధమైన పశుగ్రాసం విలువ రూ.50వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు లాలయ్య కోరాడు.

నేటి నుంచి శ్రీ అనంతపద్మనాభస్వామి బ్రహ్మోత్సవాలు


పెంజర్లలోని శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయం

కొత్తూర్, మే 20 : మండల పరిధిలోని పెంజర్ల గ్రామ శివారులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభస్వామి భక్తులకు కొంగు బంగారంగా బాసిల్లుతోంది. ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఆలయ కమిటీ చైర్‌పర్సన్ అనితారెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాల ఏర్పాట్లు చేస్తున్నారు. సంవత్సరాల క్రితం స్వయంభూగా వెలసిన అనంత పద్మనాభ స్వామిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నేరవేరతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. చిన్న ఆలయంగా ఉన్న అనంతపద్మనాభస్వామి ఆలయాన్ని కొత్తూర్ మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండేళ్ల క్రితం అధునాతనంగా నిర్మించారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల భక్తులూ తరలిరానున్నారు. మంగళవారం తెల్లవారుజామునుంచే ప్రత్యేక పూజ కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 21 హోమం, గరుడ కల్యాణం, విశ్వక్సేన పూజ, 22న మండపారాధన, హోమాలు, స్వామి వారికి అభిషేకాలు తదితర పూజలు నిర్వహిస్తారు. 23న స్వామి వారి కల్యాణోత్సవం, అన్నదానం కార్యక్రమాలు ఉంటాయి. ఇదే రోజు సాయంత్రం గ్రామంలో ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులై ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్‌పర్సన్ అనితారెడ్డి కోరారు.

నేడు ఎక్లాస్‌ఖాన్‌పేట్ వేంకటేశ్వరస్వామి కల్యాణం

కేశంపేట: మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేటలో మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఎల్లనమోని రవీందర్‌యాదవ్ తెలిపారు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ నేతృత్వంలో కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆయన వివరించారు. కల్యాణోత్సవానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావాలని ఆయన కోరారు.

ఆమనగల్లులో భారీ వర్షం

● షోరూం గోడ కూలి విరిగిపోయిన విద్యుత్ స్తంభాలు


జలమయమైన అంతర్గత రోడ్డు

ఆమనగల్లు, మే 20: ఆమనగల్లు పట్టణంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. అకాల వర్షంతో అంతర్గత రహదారులు జలమయమయ్యాయి. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గంట పాటు కురిసిన వర్షానికి పలు చోట్ల పంటపొలాల్లో వర్షం నీరు నిలిచింది. మండలంలోని పలు గ్రామాలలో కూడ వర్షం కురిసింది. ఆమనగల్లులోని విద్యానగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఓ షోరూం ప్రహరీ కూలి ప్రధాని రహదారిపక్కన విద్యుత్ స్తంభాలపై పడడంతో పోళ్లు విరిగిపోయి కొద్దిసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే ఏఈ సీతారామ్ సిబ్బందితో అక్కడికి చేరుకొని విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు.


గోడ కూలి విరిగిన స్తంభాన్ని పరిశీలిస్తున్న ఏఈ సీతారామ్

కారు బోల్తా.. త్రుటిలో తప్పిన పెను ముప్పు


డివైడర్‌ను ఢీకొని బోల్తా పడిన కారు

ఆమనగల్లు, మే 20: కారు అదుపు తప్పి డివైడర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు బెలూన్‌లు తెరుచుకోవడంతో త్రుటిలో కారులోని వారికి ప్రాణాపాయం తప్పింది. ఆమనగల్లులో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన నలుగురు హైదరాబాద్ నుంచి ఆమనగల్లు మీదుగా శ్రీశైలం వెళ్తున్నారు. రాత్రి 2:30గంటల సమయంలో ఆమనగల్లు బస్టాండ్ వద్ద రహదారి డివైడర్‌కు కారు ఢీకొని పల్టీ కొట్టింది. డివైడర్‌కు ఉన్న స్ట్రీట్‌లైట్స్ స్తంభం విరిగిపోయింది. డివైడర్ కూలిపోయి కారు నుజ్జునుజ్జు అయ్యింది. బోల్తా పడిన కారులో బెలూన్స్ ఓపెన్ కావడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆ సమయంలో రహదారిపై ఎవరూ లేకపోవడంతో మరింత ముప్పు తప్పింది. కారు శబ్దానికి స్థానికులు రోడ్డుపైకి చేరుకున్నారు. పెట్రోలింగ్‌లో పోలీసులు వచ్చి కారును రోడ్డుపై నుంచి తొలగించారు. క్షతగాత్రులను హైదరాబాద్‌కు తరలించారు.

అభివృద్ధిలో కల్వకుర్తిని ఆదర్శంగా నిలుపుతా


ఎమ్మెల్యే నారాయణరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు, మే 20: అభివృద్ధిలో కల్వకుర్తి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిపేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో పలు అభివృద్ధి పనులకు నిధుల మంజూరుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. ఆమనగల్లు, కడ్తాల్, వెల్దండ మండలాల్లో సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి పర్యటించారు. పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. గోకారం గ్రామస్తులు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాపాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. సామాజిక న్యాయం, సమానత్వమే కాంగ్రెస్ ధ్యేయం అన్నారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రాజకీయాలకు చోటు లేకుండా అభివృద్ధి విషయంలో అంతా ప్రభుత్వంతో కలిసి రావాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఆగస్టు 15నాటికి రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో అసంపూర్తి పనులన్నీ ఎన్నికల కోడ్ ముగియగానే పూర్తిచేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని నారాయణరెడ్డి సూచించారు. రానున్న వానాకాలం పంటల సాగుకు రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు భూపతిరెడ్డి, వెంకటయ్య, ఆనంద్, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, జహంగీర్ అలీ, శ్రీనివాస్‌రెడ్డి, కేశవులు, జగన్, జంగయ్య, మానయ్య, కృష్ణనాయక్, కృష్ణ, హన్మానాయక్, నరేశ్‌నాయక్, శేఖర్ గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, యాదగిరి రెడ్డి, మల్లయ్య ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తలకొండపల్లి, మే 20 : మండల పరిధిలోని చెన్నారం గ్రామానికి చెందిన నాగోజు ఆచారి అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం ఆచారి మృతదేహాన్ని మాజీ సర్పంచ్ స్వప్నభాస్కర్‌రెడ్డి, పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి భాస్కర్ రెడ్డి రూ.3వేల సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు రమేశ్‌నాయక్, రాములు, బుచ్చిరెడ్డి, షేక్‌బాబ, చంద్యనాయక్, నర్సింహ, గోపాల్‌రెడ్డి తదితరులున్నారు.

రేపటి నుంచి దేవునిగుట్టపై తిరుకల్యాణోత్సవాలు


ఉట్లపల్లిలో పూజలందుకుంటున్న లక్ష్మీ చెన్నకేశవస్వామి


బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం

కందుకూరు, మే 20 : మండలంలోని ఉట్లపల్లి సమీపంలో ఉన్న దేవునిగుట్టపై ఈ నెల 22 నుంచి 25వరకు శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి తిరు కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తేరటి లక్ష్మణ్ సోమవారం తెలిపారు. పంచాయతీ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా వేద పండితులచే బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు మౌలిక వసతులను కల్పించడంతో పాటు ప్రతి రోజు అన్నప్రసాదాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. 22న (బుధవారం) ఉదయం మహాగణ పూజతో బ్రహ్మోత్సవాలను ప్రారంభించి, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశణం ధ్వజారోహణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23న సర్వదేవతల అభిషేకాలు, సుదర్శన హోమం, రుద్రహోమం, ఆంజనేయ హోమం, మధ్యాహ్నం స్వామివారి తిరుకల్యాణోత్సవాన్ని నిర్వహిస్తామని వివరించారు. 24న ప్రాతఃకాల పూజలు, 10 గంటలకు సామూహిక సత్యన్నారాయణ వ్రతాలు, 25న బోనాల ఊరేగింపు ఉంటాయన్నారు. బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే పి.సబితారెడ్డి హాజరువుతారని తెలిపారు. ఆయనతో ముచ్చర్ల ఎంపీటీసీ బి.మల్లేష్, గ్రామస్తులు, భక్తులు తదితరులు ఉన్నారు.

వ్యవసాయ అధికారులు
సమయ పాలన పాటించాలి

● కార్యాలయాల్లో అందుబాటులో లేక రైతుల ఇక్కట్లు

● ప్యాక్స్ చైర్మన్ గంప వెంకటేశ్

కడ్తాల్, మే 20: వానాకాలం సీజన్ ప్రారంభం నేపథ్యంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు సమయపాలన పాటించి రైతులకు అందుబాటులో ఉండాలని ప్యాక్స్ చైర్మన్ గంప వెంకటేశ్ సూచించారు. కడ్తాలలో సోమవారం రైతులు వ్యవసాయ కార్యాలయానికి వెళ్లగా ఉదయం 11గంటల వరకు ఏవో రాకపోవడంతో వెనుదిరిగిపోయారు. సమస్యను విండో చైర్మన్ వెంకటేశ్‌కు వివరించారు. స్పందించిన చైర్మన్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, ఇబ్బందులను తీర్చేందుకు అధికారులు కృషిచేయాలని, వారు వేళకు ఆఫీసుకు రాకుంటే జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దృష్టికి తీసుకుపోతామన్నారు. వెంకటేశ్ మాట్లాడుతూ అధికారులు సమయ పాలన పాటించకపోవడంతో పనుల కోసం వస్తున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించాలంటే వ్యవసాయ అధికారుల నుంచి టోకెన్ రాయించుకొని తీసుకురావాలని కేంద్రాల సిబ్బంది సూచిస్తున్నారని, రైతులు కార్యాలయానికి వెళ్తే అధికారులుండడం లేదన్నారు. జనుము విత్తనాల కోసం కార్యాలయానికి వెళ్లిన రైతులు అధికారులు లేక వెనుదిరిగారన్నారు. ఇప్పటికైనా అధికారులు రైతులకు అందుబాటులో ఉండి ఇబ్బందులు కలుగకుండా చూడాలని వెంకటేశ్ సూచించారు. దీనిపై ఏవో శ్రీలతను ఫోన్‌లో సంప్రదించగా తాను క్షేత్రపర్యటలో కడ్తాల, రావిచెడ్‌లో ఫర్టిలైజర్ దుకాణాలను పరిశీలించేందుకు వెళ్లానన్నారు. కార్యాలయంలో ఏఈవోలు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు.

'రాధాకృష్ణ ట్రస్ట్ సేవలు అభినందనీయం'

కడ్తాల్, మే 20: జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని తలకొండపల్లి జడ్పీటీసీ వెంకటేశ్ అన్నారు. పేద కుటుంబాలకు, బాధితులకు ట్రస్ట్ ద్వారా మూడు సంవత్సరాలుగా చైర్మన్ జర్పుల దశరథ్‌నాయక్ చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని పేర్కొన్నారు. కడ్తాలలోని జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయాన్ని వెంకటేశ్ సోమవారం సందర్శించారు. ట్రస్ట్ నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని జడ్పీటీసీ దశరథ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌లతో కలిసి పరిశీలించి పేదలతో కలిసి భోజనం చేశారు. వెంకటేశ్ మాట్లాడుతూ బాటసారులు, పేదలకు మధ్యాహ్నం ఏళ్లుగా ట్రస్ట్ ద్వారా అన్నదానం చేస్తుండడం అభినందనీయమన్నారు. సంపాదనలో కొంత పేదలకు, సేవాకార్యక్రమాలకు వెచ్చించడం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో జ్యోతయ్య, శేఖర్, రాజవర్ధన్‌రెడ్డి, శ్రీను, బుచ్చిబాబు ఉన్నారు.

బోడంపహాడ్‌లో వీధి నాటకం


వీధి నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

షాబాద్, మే 20 : కంప్యూటర్ యుగంలో గ్రామాల్లో నేటికీ వీధి నాటకాలతో కళాకారులు ప్రజలకు కనువిందు చేస్తూ అలరిస్తున్నారు. మండల పరిధి బోడంపహాడ్ గ్రామంలో 'పోతులూరి వీరబ్రహ్మం గారి చరిత్ర' వీధి నాటకాన్ని ఆదివారం రాత్రి పదర్శించారు. ఈ నాటకాన్ని గ్రామస్తులకు పంతులు నర్సింహారెడ్డి, అంజయ్య నేర్పించారు. నాటకంలోని బ్రహ్మంగారు, శివకోటయ్య, గోవిందమ్మ, భ్రమదాంబ, పరిపూర్ణాచారి, సిద్ధయ్య వేశధారులు బోగోతాన్ని రక్తి కట్టించారు. వీధి నాటకాన్ని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు.

మార్షల్ ఆర్ట్సలో జ్ఞానతేజకు గోల్డ్ మెడల్


గోల్డ్ మెడల్ అందుకుంటున్న చిన్నారి జ్ఞానతేజ

షాబాద్, మే 20: మండల పరిధిలోని లక్ష్మారావుగూడ గ్రామానికి చెందిన మేకల జ్ఞాన తేజ మొయినాబాద్ మండలం కాకతీయ హైస్కూల్‌లో రెండో తరగతి చదువుతోంది. చదువుతో పాటు గ్లోయింగ్ సోతకన్ కరాటే అకాడమిలో శిక్షణ పొందుతోంది. సోమవారం గోవాలో జరిగిన ఇంటర్‌నేషనల్ మార్షల్ ఆర్ట్ చాంపియన్‌షిప్‌లో జ్ఞానతేజ గోల్డ్ మెడల్ సాధించింది. చిన్నారి ప్రతిభకు పాఠశాల ప్రిన్సిపాల్, కరాటే మాస్టర్ సియాన్.కె. సుధాకర్, తండ్రి విజయ్‌కుమార్, పెదనాన్న మేకల శ్రీనివాస్, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు ఆసక్తి ఉన్న అంశాల్లో శిక్షణ ఇప్పిస్తే ఇలా రాణిస్తారని, తల్లిదండ్రులు తమ పిల్లలను అన్ని రకాలుగా ప్రోత్సహించాలన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ల రికవరీ.. అప్పగింత


ఫోన్లు పోగొట్టుకున్న వారికి అప్పగిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

శంషాబాద్, మే 20 : శంషాబాద్ ఆర్జీఐఏ-రూరల్ పోలీసుస్టేషన్ల పరిధుల్లో పోగొట్టుకున్న ఫోన్లను పోలీసులు రికవరీ చేయగా సోమవారం డీసీపీ కార్యాలయంలో డీసీపీ నారాయణరెడ్డి యజమానులకు ఫోన్లను అప్పగించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నవారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఆ వివరాలను సీఈఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకుంటామన్నారు. ఆర్జీఐఏ-శంషాబాద్ రూరల్ పీఎస్‌ల పరిధిలో 30 ఫోన్లను గుర్తించి అప్పగించామని తెలిపారు.

నల్లమట్టి తరలించిన వ్యక్తిపై కేసు నమోదు

మాడ్గుల, మే 20 : మండలంలోని ఇర్విన్ చెరువు నుంచి అక్రమంగా మట్టిని జేసీబీతో తోడి ట్రాక్టర్లలో ఇటుక బట్టీలకు తరలిస్తున్నారని గ్రామస్తులు ఇరిగేషన్ అధికారికి సమాచారం ఇచ్చారు. దీంతో అధికారి చంద్రకాంత్ రెడ్డిపురం గ్రామానికి చెందిన కాసు భోజరెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు చేరుకొని జేసీబీని స్టేషన్‌కు తరలించారు. ఇరిగేషన్ అధికారి ఫిర్యాదు మేరకు కాసు భోజిరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న ఏడుగురి బైండోవర్

యాచారం, మే 20 : అక్రమంగా మద్యం, సారా విక్రయాలకు పాల్పడుతున్న ఏడుగురిని సోమవారం ఎక్సైజ్ అధికారులు బైండోవర్ చేశారు. మద్యం అమ్ముతున్న ఎస్.బాలి, దయానంద్, బాలరాజు, కె.జ్యోతి, భీమా, వేణుగోపాల్, జయమ్మలను బైండోవర్ చేశామని అధికారులు తెలిపారు.

మహేందర్‌ను కలిసిన బీజేవైఎం నాయకులు



తలకొండపల్లి, మే 20: కల్వకుర్తి నియోజకవర్గ బీజేవైఎం నాయకులు సోమవారం బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులంత సమాయత్తం కావాలని వారు సూచించినట్లు బీజేవైఎం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పద్మ అనిల్, రాష్ట్ర అధికార ప్రతినిధి భగీరథ్, జిల్లా అధ్యక్షుడు యాదీశ్, తిరుపతి ఉన్నారు.